# అతిథి

పి.వి.రమణ



బలమైన సంఘటనే గాకుండా, అతి సామాన్యమైన జీవితానుభవం గూడా కథావస్తువును అలంబనమవుతుందనేది చలపతి నాకు నేర్పిన గొప్ప సత్యం చలపతి నాకు బీరకాయపీచు వరుస బంధువు. చిన్ననాటినుండీ ఇరువురం కల్సిమెల్సి తిరిగినందువల్ల మా బంధం కొంచెం చిక్కబడింది మనుషులందరిలాగే ఆయా అవయవ నిర్మాణం చలపతికి క్రమం తప్పకుండా వున్నా, మనసుమాత్రం ఎంతో కొంత విడ్డూరమైనదనే విషయాన్ని వాడితో పరిచయమున్న ప్రతి ఒక్కరూ అంగీకరించి తీరాలి దీనికితోడు వాడి నరనరాల్లో రక్తంతోపాటు సరి సమానంగా లౌకిక జ్ఞానం గూడా ప్రవహిస్తూవుండేది, పాఠశాల దశనుంచి అది పరిణతి పొంది, కళాశాల స్థాయిలో కాకలుదీరి. జీవితంలో అదుర్దేనాటికి చిరంజీవిగా నిల్చిపోయింది.

చలపతి దృష్టిలో తల్లి బాధ్యత పాలిచ్చి పెంచేంత వరకే రెక్కలొచ్చేంత వరకే తండ్రి. అంతకు మించిన అవసరాలు అనుబంధాలు కన్నవాళ్ళతో అనవసరమనేదే వాడిసిద్ధాంతం వాడి సిద్ధాంతాల రుచి చవి చూడకముందే, లేదా ఆ దురదృష్టాన్ని అనుభవించక ముందే వాడి తండ్రి కన్నుమూశాడు పెద్దవాడై, గృహస్థుడు గూడా అయిన తర్వాత తల్లిని నీ దిక్కు నీవే చూసుకోమన్నాడు కన్నీరు నింపుకొని, కడుపు చేత్తో పట్టుకొని దూరపు



బంధువు ఇంటి తరలి పోయిందా మహా తల్లి. ఉపయోగం లేకపోతే భార్యను గూడా చలపతి దూరం చేసేవాడే ; కాని ఆమె సంపాదనపరురాలు. ప్రేమ ఆప్యాయతలు వీటి సంగతేమో గాని, ఆర్జన కోసం ఆమెతో బంధాన్ని అధికం చేశాడు చలపతి. ఆమెకు రొప్పొచ్చినా, రోగమొచ్చినా నాలుగు రోజులు సెలవు పెడితే గిజగిజ లాడిపోయేవాడు. ఆ నాలుగు రోజుల జీతం రాళ్ళు తగ్గించి వస్తాయన్నదే వాడి దుఃఖం వాడి అదృష్టమో దురదృష్టమో పిల్లలు మాత్రం కలగలేదు వాడికి. కలగలేదనే బాధా వాడికిలేదు బయటి పిల్లల్ని చూసినప్పుడన్నా ఏ వెలితీ, వేడుకా వాడిలో కన్పించేవికావు. పిల్లలుగూడా పుట్టక

తోనే సంపాదించుకొచ్చే వాళ్ళైతే కావాలని కావిర్లాడి పోయేవాడేమో మరి!

అటువంటి మనస్తత్వంగల చలప తింటికి అడపా దడపా పోయే అవసరం నాక్కల్గేది నేనే కల్పించుకొనే వాడి నంటే సమంజసంగా వుంటుంది. పదే పదే పట్నం పోయినప్పుడల్లా హోట ళ్ళకు తగలేయాలంటే నాలాటివాడికి అయ్యేపని కాదు. అందునా ఈ కరువు రోజుల్లో, ఏ పంచలోనో పబ్బం గడుపు కోక తప్పదుమరి ఆదిలో నా రాకపోకలు అంతగా ఆవేదన కల్గించేవి గావు వాడికి పోనుపోను వాడిలో మార్పు స్పష్టంగా కన్పించేది వెళ్తే ఎప్పుడొచ్చా వన్నైనా పల్కరించేవాడు కాదు. ఒక వేళ పలుకరించినా ఇదేదో మొక్కుబడి కన్నట్లుగానే వుండేది

ఓమారు ఆరుసగా నాల్గురోజులు పట్నంలో వుండాల్సిన అవసర మేర్ప డింది. ఆ నాలుగు రోజులూ తిండీ తిప్పలన్నీ చలపతి ఇంట్లోనే సాగిం చాను. నేను ఎదురుగా వున్నా, మౌనం గానే వుంటిపోయేవాడు చలపతి వాడి మౌనంలో చిమ్ముకొచ్చిన ఎన్నో భావాల్ని వాడికళ్ళద్వారా చదవగలిగగా న్నేను. "రోజులు తరపడి మామీద పడ్తుంటే నీ భారం మోయటం మావల్ల కాదు. అన్న విషయం అందులో ఒకటి ఆ మరుసటిరోజే మావూరికి వచ్చేశా న్నేను. ఒక పదిహేనురోజులూ చల పతిసీ, నా ఆతిథ్యం పట్ల వాడు చూపిన అయిష్టతనూ మర్చిపోయాను. కారణం! అతకు మించిన విషాద పరిస్థితులు, పీక్కుతినే సంఘటనలు నా సంసారంలో నిత్యమూ ఎదుర్కోవల్సి రావటమే ఈ బరువు ముందు చలపతి అన్న మాటలు, వాటి అంతరార్థాలు వెలికి తెచ్చుకొని తర్కించుకొనే అవకాశం గాని, ఆ ప్రశాంతతగాని నాకు లేకుండాపోయినై

ఉన్నట్లుండి మళ్ళీ పట్నం వెళ్ళే అవసరం వరద నీరులా తరుము కొచ్చింది. ఈ అవసరం నెరవేరి అను కున్నవన్నీ సానుకూల పడితే, ఏ చీకూ చింతా లేకుండా ఓపదిరోజుల పర్యంతం కుటుంబాన్ని నెట్టుకు రావచ్చు. ఇంకా అదృష్టం కల్సివస్తే మాసానికి సరిపడే గ్రాసం అందినా అందొచ్చు. మధ్యతర గతి బ్రతుకులకు కడుపునిండితే అదే పండుగ. అంతకు మించిన ఆశలు పెంచుకోవటం. ఎంత అపరాధమో, అపచారమో మధ్యతరగతి బరువు బాధ్యతల్ని నిరంతరం మోస్తుండే గృహిణులకు బాగా తెల్సు. పిల్లలకు ఒకపూటైనా కడుపునిండా తిండి పెట్ట గలిగిన భర్త, ఇల్లాలి కళ్ళకు సర్వ సమర్థుడైన మగవాడి క్రిందే జమ - ఈ దేశంలో; ఆ మాటకొస్తే ఏ దేశంలో నైనా మధ్యతరగతి బ్రతుకుల్లో సర్దు బాట్లకోసం తహతహ తప్పదేమో మరి! ఎవరేమనుకున్నా, చీదరించినా, ఛీత్క-

రించినా అవసరం మనదైనప్పుడు తలొంచుకోక తప్పదు మరి. చలపతి విషయంలోనూ అధికంగా ఆలోచించటం అనవసర మన్పించింది. వాడి అసంతృప్తి వాడిది నా అవసరం నాది పబ్బం గడుపుకోవాలనుకొంటే పరాభవాన్ని పట్టించుకోగూడదు

మరునాటి సాయంత్రం తిరిగి పట్నం చేరుకొన్నాను. ఓ అరగంట అటూ ఇటూ తిరిగి చలపతింటికేసి నడిచాను. గడపలో కాలు పెట్టానో లేదో లోనుండి అరుపులు, పెడబొబ్బలూ విన్పిస్తున్నాయి. పరస్పర తిట్లూ, శాపనార్థాలే గాకుండా ఆ దంపతులిద్దరూ చేతులూ చేతులూగూడా కలుపుకొంటున్నారు వీడి అరుపులు, ఆవిడ ఏడుపులూ ; మొత్తానికి ఆ ఇల్లోక రణరంగమే అయింది. అట్లాగే ఓ అయిదు నిమిషాలు నిలబడ్డాను తలుపు వారగా; మరింత రెచ్చిపోతున్నారు వాళ్ళు ఆగ్రహావేశాలు మిన్నుముడుతున్నాయి. మధ్య మధ్య నాపేరే ప్రస్తావన కొస్తున్నది వాళ్ళు పడుతున్న ఘర్షణంతా నా గూర్చే అని తెల్సికోటానికి అట్టేసేపు పట్టలేదు. ఓ వారం రోజులనాకాషక్కడ గడపాలని వచ్చిన ఈ తరుణంలోనా వీళ్ళ కీచులాట? మనసంతా అదోలా అయిపోయింది నాకు. ఓ అరగంట తర్వాత మళ్ళీ వద్దామని మెల్లగా మెట్లు దిగాను తీరా దిగివచ్చిన తర్వాత తెల్సొచ్చింది, చెప్పులు పైనే వదిలేసి వచ్చానన్న సంగతి. వాటికోసం మళ్ళీ మెట్లెక్కాను. లోపల అరుపుల్లేవు అసలు అలికిడే వున్నట్లులేదు ఆశ్చర్యంతో తలుపు కొంచెం ప్రక్కకు నెట్టి లోనికి చూశాను ఈమారు నోరు వెళ్ళబెట్టటమే నా వంతైంది. ఎన్నాళ్ళనుండో కరువ్వాచిపోయినట్లుగా ఆ దంపతులిద్దరూ కౌగిట్లో ఒకరి కొకరు అతుక్కుపోయున్నారు

"హడలగొట్టాం వెధవని ; మళ్ళీ ఈ గడప తొక్కడు."

చలపతి గొంతు అది

"ఇప్పటికైనా ఈ పీడ వదిలితే అదే పదివేలు."

వాడి అర్థాంగి వంత పలుకులు.

ఆ పలుకులు నాకు ములుకుల్లా గుచ్చుకోకపోయినా, నన్ను సాగనంపటానికే ఆ దంపతులిద్దరూ ఇంత నాటకాన్ని కూడబలుక్కొని కొనసాగించారని తెలిసొచ్చింతర్వాత, లోనికి అడుగు పెట్టటానికి నాకు మనస్కరించింది కాదు ; ధైర్యమూ చాలింది కాదు. ఉస్సురోమంటూ వెనుదిరిగాను

